www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 10 జూన్ 2025
5
వైఎస్ఆర్

## నేటి నుంచి అండర్-19 వన్డే క్రికెట్ టోర్నీ

**ప్రజాశక్తి - కడప :** జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఎసిఎ) సహకారంతో ఈనెల 10 నుంచి కడపలోని వై.ఎస్.రాజారెడ్డి ఎసిఎ స్టేడియం, కెఒసిఆర్ఎం క్రికెట్ మైదానాలలో ఎసిఎ సౌత్ జోన్ అండర్ -19 వన్డే క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం కానుంది. ఈ టోర్నమెంట్ లో సౌత్ జోన్‌కు చెందిన కడప, కర్నూలు, చిత్తూరు, నెల్లూరు, అనంతపురం జిల్లాల జట్లు పాల్గొననున్నాయి. సోమవారం అన్ని జట్లు కడపకు చేరుకున్నాయి. జిల్లా క్రికెట్ అసోసియేషన్ టోర్నమెంట్‌లో పాల్గొనేందుకు వచ్చిన అన్ని జిల్లాల క్రికెట్ జట్ల క్రీడాకారులకు వసతి భోజన సౌకర్యాలను ఏర్పాటు చేసింది. రెండు మైదానాల్లో ఆటకు అనువుగా అవుట్ ఫీల్డ్, పిచ్‌లను క్యూరేటర్లు బాలరాజు, హరి సిద్ధం చేశారు. టోర్నమెంట్ ప్రారంభ రోజు వైఎస్ రాజారెడ్డి ఎసిఎ స్టేడియంలో కర్నూలు, నెల్లూరు జట్ల మధ్య, కెఒసిఆర్ఎం క్రికెట్ మైదానంలో కడప, చిత్తూరు జట్ల మధ్య మ్యాచ్‌లు జరుగనున్నాయి.

# గండికోటకు టెంట్ సిటీ!

### రూ.ఐదు కోట్లు కేటాయింపు
### 60 గదుల ఏర్పాటుకు కసరత్తు
### ఒబెరాయ్ హోటళ్ల మాటేమిటో?

**ప్రజాశక్తి - కడప ప్రతినిధి**

గండికోట పర్యాటక ప్రాంతంలో టెంట్‌సిటీ ఏర్పాటు కానుంది. ప్రభుత్వం పర్యాటకులను పెద్దఎత్తున ఆకర్షించాలనే ఉద్దేశంతో హోటళ్లకు పెద్దఎత్తున భూములు కేటాయిస్తోంది. తాజాగా 10 ఎకరాల విస్తీర్ణంలో ప్రభుత్వ, ప్రయివేటు సంస్థల భాగస్వామ్యంలో రూ.ఐదు కోట్ల వ్యయంతో కూడిన 60 గదులను ఏర్పాటు చేయడంపై దృష్టి సారించింది. ప్రపంచంలోనే గ్రాండ్‌కెనాన్ తరహా అద్భుత వాతావరణం కలిగిన గండికోటలో పర్యాటకుల సంఖ్య పెరిగే అవకాశాల నేపథ్యంలో సాస్కి పథకం సహా పలు ఇతర పర్యాటక సంస్థలను ఆకర్షించడం వరకు బాగానే ఉన్నా, గత సంస్థల నిర్వాకాలను పరిశీలించి, వాటిని గాడిలో పెట్టే ప్రయత్నం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**ఒబెరాయ్ హోటళ్ల మాటేమిటో?**

వైసిపి సర్కారు హయాంలో ప్రముఖ వ్యాపారవేత్త ఒబెరాయ్ రూ.1200 కోట్లతో హోటళ్ల ఏర్పాటు చేస్తామనే పేరుతో 50 ఎకరాల విలువైన స్థలాన్ని పొందిన సంగతి తెలిసిందే. అనంతరం ఒబెరాయ్ హోటళ్ల నిర్మాణాలు ఏమయ్యాయో ఎవరికీ తెలియడం లేదు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో కేంద్ర, రాష్ట్రాల్లో అధికారంలోకి వచ్చిన కూటమి సర్కారు గత భూకేటాయింపులు, వాటి పురోగతిపై దృష్టి సారించడంలో మీనమేషాలు లెక్కించడం విస్మయాన్ని కలిగిస్తోంది. ఒబెరాయ్ హోటళ్ల నిర్మాణాల పురోగతిని పరిశీలించిన అనంతరం ఇతర సంస్థలకు కేటాయింపులు చేయడం సమంజసంగా ఉంటుందనే వాదన వినిపిస్తోంది. కనీస ప్రయత్నం చేయకుండా తాజాగా టెంట్‌సిటీ పేరుతో 10 ఎకరాలను కేటాయించడం ఎవరి ప్రయోజనాల కోసమో తెలియడం లేదనే వాదన వినిపిస్తోంది.

**పారదర్శకత ఏదీ?**

ఒబెరాయ్ హోటళ్లకు కేటాయించిన 50 ఎకరాల్లో నిర్మాణాల పురోగతి, నిర్మాణాలు ఎంతవరకు వచ్చాయో, ఒకవేళ నిర్మాణాలు చేపట్టని పక్షంలో నిర్మాణాలు చేపట్టేలా చేయడం, లేకపోతే భూ కేటాయింపులను రద్దు చేయడమో తేల్చాలి. అనంతరం ఎపిటిడిసి టెంట్‌సిటీ తదితర ఇతర నిర్మాణాలు, మౌలిక సదుపాయాల కల్పన గురించి ఆలోచించాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పవచ్చు. పర్యాటకులను ఆకర్షించే పేరుతో పదుల సంఖ్యలో ఎకరాల భూములను పారిశ్రామిక వేత్తలకు దారాధత్తం చేయడం ఎంతవరకు సబబనే వాదన వినిపిస్తోంది.

# విశాఖ 'ఉక్కు' ప్రయివేటీకరణ ఆపాలి

### పరిశ్రమకు సొంత గనులు కేటాయించాలి
### - సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు

ఆందోళన చేస్తున్న సిఐటియు, ఎఐటియుసి నాయకులు, కార్మికులు

**ప్రజాశక్తి - కడప అర్బన్**

విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణ ఆపాలని, సొంత గనులు కేటాయించాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు డిమాండ్ చేశారు. సోమవారం విశాఖ స్టీల్ ప్లాంట్‌లో పనిచేస్తున్న దాదాపు 3,200 మంది కాంట్రాక్టు కార్మికులను తొలగించారని, వారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని నగరంలోని ఐటిఐ సర్కిల్ దగ్గర సిఐటియు, ఎఐటియుసి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ముఖ్య అతిథులుగా హాజరైన ఓబులు మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణను ఆపాలని మూడు సంవత్సరాల నుంచి అక్కడున్న కార్మిక సంఘాలు పెద్ద ఎత్తున ఆందోళన, పోరాటాలు, నిరాహార దీక్షలు చేస్తున్నారని పేర్కొన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రయివేటీకరణ చేసే ఆలోచనలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను ఆకారణంగా తొలగించారని చెప్పారు. వారికి రావలసిన ఎరియర్ పాలసీ కానీ, ఇతర బెనిఫిట్స్ ఏమీ ఇవ్వకుండా కార్మికులతో వెట్టి చాకిరి చేయించుకుంటున్నారని తెలిపారు. ఇప్పుడు అధికారంలో ఉన్న కూటమి నాయకులు గతంలో తాము అధికారంలోకి వస్తే విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రయివేటీకరణ కాకుండా అడ్డుకుంటామని పేర్కొన్నారు. జనసేన, టిడిపి నాయకులు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు లేనిపోని అబద్ధాలతో స్టీల్ ప్లాంట్ లో పనిచేస్తున్న కార్మికులను మోసం చేశారన్నారు. ప్రస్తుత ఎంపీగా ఉన్న భరత్ స్టీల్ ప్లాంట్‌లో కొన్ని విభాగాలలో సక్రమంగా పని జరగడం లేదని, పూర్తిస్థాయిలో ఉత్పత్తి ప్రారంభమైతే మిగతా కార్మికులను తీసుకుంటాం అనడం విడ్డూరంగా ఉందని వాపోయారు. గతంలో విశాఖ స్టీల్ ప్లాంట్ నుంచి దాదాపు 11,000 మంది రెగ్యులర్ ఉద్యోగులు విధులు నిర్వహించేవారని పేర్కొన్నారు. ఇప్పుడు వారిలో దాదాపు 9,000 మంది వరకు రిటైర్డ్ అయ్యారని, కేవలం 3000 మంది మాత్రమే రెగ్యులర్ ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. రిటైర్డ్ అయినవారి స్థానాల్లో కాంట్రాక్టు పద్ధతి కింద పనిచేస్తున్న కార్మికులను తీసుకొని పర్మినెంట్ చేయాలన్నారు. ఇప్పటికైనా తొలగించిన కార్మికులను తిరిగి వెంటనే విధుల్లో చేర్చుకోవాలన్నారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని రకాల కార్మికులను కలుపుకొని రాష్ట్రవ్యాప్త ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, నాగ సుబ్బారెడ్డి, సిఐటియు నగర అధ్యక్ష, కార్యదర్శులు పి.చంద్ర రెడ్డి, పి.వెంకటసుబ్బయ్య, ఎఐటియుసి జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రెటరీ బాదుల్లా, నగర ప్రధాన కార్యదర్శి మద్దిలేటి, సిఐటియు మున్సిపల్ యూనియన్ నగర అధ్యక్షులు రవి, నాయకులు కిరణ్, తిరుపాల్, ప్రకాష్, సిఐటియు నాయకులు కుమారస్వామి రెడ్డి, మహేష్, పవన్, ఉదయ్ పాల్గొన్నారు.

## బాలతిమ్మయ్యగారిపల్లెలో విషాదం

### - నీటి సంపులో పడి కవలలు మృతి

**ప్రజాశక్తి- చక్రాయపేట**

మృతి చెందిన రామ, లక్ష్మణులు

మండల పరిధిలోని బాలతిమ్మయ్యగారిపల్లెలో ఆదివారం రాత్రి విషాదం చోటు చేసుకుంది. రామ, లక్ష్మణులు,(10) అనే ఇద్దరు కవల పిల్లలు నీటి సంపులో పడి మృతి చెందారు. వివరాలు.. రామ లక్ష్మణులు ఖాజీపేట మండలం నాగసాని పల్లికి చెందిన వారిగా పోలీసులు గుర్తించారు. చిన్నారుల తండ్రి మృతి చెందడంతో తల్లి మరొకరితో వెళ్లిపోయింది. అప్పటి నుంచి పిల్లల ఆలనా పాలనా మేనమామ కొండయ్య చూసు కునేవారు. కొండయ్య చక్రా యపేట మండలం బాల తిమ్మయ్య గారిపల్లెలో భాస్కర్ అనే వ్యక్తి మామిడి, నిమ్మతోటల వద్ద కాపలాదారుడిగా పనిచేస్తూ పిల్లల ఆలనా పాలనా చూసుకునేవారు. తోట యజమాని భాస్కర్ ఆదివారం పిల్లల గురించి ఆరాతీశారు. మేనమామ కొండయ్య ఆడుకుంటూ ఉంటారని చెప్పారు. సాయంత్రమైనా పిల్లలు ఇంటికి తిరిగి రాకపోవడంతో వెతకడం ప్రారంభించారు. మామిడితోట సమీపంలో ఉన్న నీటి సంపు వద్దక వెళ్లి చూడగా పిల్లలు విగత జీవులుగా పడి ఉన్నారు. తల్లిదండ్రులు లేకపోవడంతో పిల్లల మృతదేహాలను మేనమామ తన సొంత గ్రామమైన ఖాజీపేట మండలం నాగసానిపల్లెకు తీసుకెళ్లారు. సామాజిక మాధ్యమాల ద్వారా పోలీసులకు సమాచారం అందడంతో వారి ఆదేశాల మేరకు పోస్టుమార్ట నిమిత్తం ఇద్దరి మృతదేహాలను తిరిగి వేంపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలిచారు. అక్కడ పోస్టుమార్టం చేయడానికి వైద్యులు అందుబాటులో లేకపోవడంతో కడప రిమ్స్‌కు తరలించినట్లు ఎస్ఐ జె చంద్రశేఖర్ తెలిపారు. పిల్లల మేనమామ బత్తల కొండయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ ఐ తెలిపారు. పోస్టుమార్టం అనంతరం వారి మేనమామ సొంత గ్రామం నాగసానిపల్లెకు తరలించారు.

**మదనపల్లెలో మరో బాలుడు..**

మృతి చెందిన జబీర్ కుమార్

**మదనపల్లె అర్బన్ :** సంపులో పడి ఐదేళ్ల బాలుడు మృతి చెందిన విషాదకర సంఘటన సోమవారం సాయంత్రం మదనపల్లెలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బీహార్ రాష్ట్రం, పాట్నాకు చెందిన సోహాదేవి తన భర్త బోలాసాయి వదిలేయడంతో రెండేళ్ల కిందట పొట్ట చేతపట్టుకుని తన ఐదేళ్ల కుమారుడు జబీర్ కుమార్‌తో బతుకుదెరువు కోసం మదనపల్లెకు వలస వచ్చింది. స్థానిక బాలాజీ కాలనీలో అద్దె ఇంట్లో నివాసముంటూ ఎస్టేట్ సమీపంలోని డీమార్ట్‌లో పని చేసుకుంటూ జీవనం చేస్తోంది. ప్రతిరోజు పనికి వెళ్లే సోహాదేవి తన కుమారున్ని ఇంటి వద్దే వదిలి వెళ్ళేది. యధా ప్రకారం సోమవారం కుమారున్ని ఇంటి వద్ద వదిలి పనికి వెళ్ళింది. సాయంత్రం సమయంలో జబీర్ కుమార్ తోటి పిల్లలతో కలిసి ఆడుకుంటూ స్థానికంగా ఉన్న మసీదు సమీపంలోని నీటిసంపులో పడి పోయాడు. స్థానికులు తల్లికి సమాచారం అందించారు. ఆమె పరుగు పరుగున వచ్చి స్థానికుల సాయంతో సంపులోంచి బిడ్డను వెలికితీసి వెంటనే స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మార్గమధ్యంలోనే బాలుడు మృతి చెందినట్లు తెలిపారు. తల్లి కన్నీరు మున్నీరుగా విలపించింది. రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పార్టీ నిబంధనలకు వ్యతిరేకంగా పనిచేస్తే చర్యలు : డిసిసి

**ప్రజాశక్తి - కడప :** కాంగ్రెస్ పార్టీలో గ్రూపు రాజకీయాలకు ఎప్పుడూ తావు ఉండదని, పార్టీ నిబంధనలకు వ్యతిరేకంగా పనిచేస్తే చర్యలు తప్పవని డిసిసి అధ్యక్షులు ఎన్. డి. విజయ జ్యోతి అన్నారు. సోమవారం కడప జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఏ పార్టీలోనైనా పని చేసే గ్రూపు, పనిచేయని గ్రూపులు ఉంటాయన్నారు. పార్టీ నియమ నిబంధనలకు అందరూ కట్టుబడి పని చేయాలని అన్నారు. నిబంధనలకు వ్యతిరేకంగా పని చేస్తే వారు ఎంతటి వారైనా సరే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రూపిజాన్ని పార్టీ ఎప్పుడూ ప్రోత్సహించదు అని ఈ సందర్భంగా ఆమె స్పష్టం చేశారు. ఈనెల 12న పిసిసి అధ్యక్షులు వై.ఎస్. షర్మిల కడప పర్యటనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా ప్రజల మనోభావాలు, సమస్యలు తెలుసుకోవడమే ఈ పర్యటన ముఖ్య ఉద్దేశమని తెలిపారు. 12న మధ్యాహ్నం 3 నుండి సాయంత్రం 5 గంటల వరకు కడప ఐఎంఎ హాల్లో నిర్వహించే పార్టీవివిధ అంశాలపై సమీక్ష సమావేశాన్ని అత్యంత విజయవంతంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పేర్కొన్నారు. సమావేశంలో నియోజకవర్గ కో-ఆర్డినేటర్లు జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, కమలాపురం, పులివెందుల ఇన్‌ఛార్జులు పాల్గొన్నారు.

### కాంగ్రెస్ పార్టీలో రెండు గ్రూపులు

**- ఐఎంఎ హాలులో నాయకుల బాహాబాహీ**

కడప వేదికగా ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీలో గ్రూపు పోరు సాగుతోంది. పిసిసి అధ్యక్షులు వై.ఎస్. షర్మిలకు వ్యతిరేకంగా సోమవారం ఎఐసిసి సభ్యులు సుంకర పద్మశ్రీ సమావేశం నిర్వహించారు. ఏం కష్టపడకుండానే షర్మిల పదవి వచ్చిందని విమర్శించారు. దీన్ని జీర్ణించుకోలేని షర్మిల గ్రూపు నాయకులు ఐఎంఎ హాలుకు చేరుకున్నారు. ఇరు గ్రూపుల మధ్య గొడవ మొదలై బాహాబాహీకి దిగారు. పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ గొడవపడ్డారు . ఒకరి చొక్కాలు ఒకరు పట్టుకొని కొట్టుకునే పరిస్థితి ఏర్పడింది. ఒకే పార్టీలో రెండు గ్రూపులుగా చీలి బాహాబాహీకి దిగి కొట్టుకోవడాన్ని చూసి అందరూ ఆశ్చర్యపోతున్నారు.

## ఇంజినీరింగ్ కార్మికుల సమ్మె నోటీసు

**ప్రజాశక్తి - కడప అర్బన్**

కమిషనర్‌కు సమ్మెనోటీసు అందజేస్తున్న కార్మికులు

మున్సిపల్ కార్పొరేషన్‌లో పని చేస్తున్న ఇంజినీరింగ్ కార్మికుల సమస్యల పరిష్కరించాలనిఎపి మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్( సిఐటియు అనుబంధం) జిల్లా ప్రధాన కార్యదర్శి విజయభాస్కర్, కోశాధికారి గోపి, సహాయ కార్యదర్శులు ఆనందరావు, బ్రహ్మానందరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం మేయర్ సురేష్ బాబు, కమిషనర్ మనోజ్ రెడ్డి, అదనపు కమిషనర్ రాకేష్ చంద్రంకు సమ్మె నోటీస్ అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 2019లో వచ్చిన వైసిపి ప్రభుత్వం పారిశుధ్య కార్మికులకు రూ.21వేలు, చెత్త తరలించే డ్రైవర్స్ రూ. 24,500 ఇచ్చి ఇంజినీరింగ్ కార్మికులకు కేవలం రూ.15 వేలు ఇవ్వడం దారుణమని తెలిపారు. అప్పటి నుంచి ప్రభుత్వంతో పోరాటం చేసిన ఇప్పటి వరకు పెరగలేదని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి ఏడాది అయిందని పేర్కొన్నారు. అనేక రూపాల్లో ప్రభుత్వానికి విన్న వించుకున్నప్పటికి వేతనాలు పెంచడం లేదని తెలిపారు. పెరిగిన ధరలకు అనుగుణంగా జీతాలు ఇవ్వాలని కోర్టులు చెబుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని వాపోయారు. రిటైర్డ్ మెంట్ వయస్సు 62 పెంచాలని తెలిపారు. బెనిఫిట్స్ అందజేయాలని చెప్పారు. వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని పేర్కొన్నారు. సమస్యలను పరిష్కరించకపోవడంతో విధిలేని పరిస్థితుల్లో సమ్మెలోకి వెళ్తున్నామని పేర్కొన్నారు. 14 రోజుల తర్వాత ఎప్పుడైనా సమ్మెలోకి వెళదామని తెలిపారు. కార్యక్రమంలో పర్మినెంట్ నాయకులు కొండయ్య, చంద్రాయుడు, సోమిరెడ్డి, పీట్టర్స్, ఆంజనేయులు, శ్యాం, మహేశ్వరరెడ్డి, ఈశ్వర్ రెడ్డి, రాంమోహన్ రెడ్డి, శ్రీను, సిద్దయ్య, లక్షుమ్మ, హరి సుబ్బయ్య, రాజా, హనుమంత్ రెడ్డి, శ్రీను, శివ శంకరయ్య, శివ హనుమంత్ రెడ్డి, ప్రదీప్ కుమార్, సందీప్, గోపాల్, సుబ్బయ్య, గురువయ్య, శ్రీకాంత్, శరత్, శ్రీధర్, కార్మికులు పాల్గొన్నారు.

## మంత్రి విద్యా సంస్థల్లో దోపిడీ

### - నారాయణ, భాష్యం విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి
### - ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శుల డిమాండ్

**ప్రజాశక్తి - కడప అర్బన్**

మాట్లాడుతున్న రవి

రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ విద్యా సంస్థలలో పుస్తకాలను విక్రయిస్తూ విద్యను వ్యాపారం చేయడం దారుణమని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎద్దు రాహుల్, వీరపోగు రవి అన్నారు. సోమవారం నారాయణ, భాష్యం విద్యాసంస్థల ఎదుట పుస్తకాల విక్రయాల్ని అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో ప్రయివేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు పుట్టగొడుగుల పుట్టుకొస్తున్నాయని తెలిపారు. దోపిడే పరమావధిగా వీటిని నెలకొల్పుతున్నారని విమర్శించారు. వేలాది ఫీజులు వసూలు చేస్తున్నా విద్యాశాఖ అధికారులు పట్టించుకోకపోవడం వెనుక ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. ఎస్ఎఫ్ఐగా విద్యా వ్యాపారాన్ని అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈనెల 12న విద్యాసంస్థలు తెరవాల్సి ఉండగా 1 నుంచే ప్రయివేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు తెరిచి వ్యాపారం చేస్తూ ఉన్నారని పేర్కొన్నారు. ఎస్ఎఫ్ఐగా ఆందోళన చేస్తున్నా విద్యాశాఖ పట్టించుకోవడంలేదని చెప్పారు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు నిద్రమత్తు వీడి పుస్తకాలు, అధిక ఫీజులు పెంచి విక్రయిస్తున్న విద్యాసంస్థలను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. గుర్తింపు లేని విద్యాసంస్థల జాబితాను విడుదల చేయాలని పేర్కొన్నారు. ఒక బ్రాంచ్‌కు అనుమతి తీసుకొని పది బ్రాంచ్‌లు కొనసాగిస్తున్న విద్యాసంస్థలపై పోరాడతామని హెచ్చరించారు. రాబోవు రోజుల్లో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు రాజశేఖర్ రెడ్డి, అజయ్, జిల్లా కమిటీ సభ్యులు అభినయ్, కడప నగర కార్యదర్శి మోహన్, ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, సంజయ్, అఖిల్ పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి కృషి : ఎంపిడిఒ

**ప్రజాశక్తి-కాశినాయన**

మండలంలోని అధికారులందరూ మండల అభివృద్ధి సమ స్యల పరిష్కార దిశగా పనిచేయాలని మండల అభివృద్ధి అధికారి మైథిలి పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రమైన నరసాపురంలోని ఎంపిడిఒ సభాభవనంలో ఎంపిపి పోలమ్మ ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ మండల సమావేశానికి అధికారులు ఎందుకు హాజరు కావడం లేదో అర్థం కావడం లేదని, అలాంటి వారిపై కచ్చితంగా చర్యల కోసం జిల్లా అధికారులకు ఫిర్యాదు చేస్తానని అని అన్నారు. ఏవైతే మండల సమావేశంలో మీరు పరిష్కరిస్తామని హామీ ఇస్తారో అన్ని నెరవేర్చాలని పేర్కొన్నారు. మండల సమావేశానికి రెండు రోజులు ముందు తనకు పూర్తి సమాచారం ఇవ్వాలని ఇవ్వాలన్నారు. వచ్చిన అధికారులు తమ తమ శాఖల వివరాలు చదివి వినిపించి ప్రజలకు ఏమైనా అవసరం ఉంటే తమ దృష్టికి తేవాలని అన్నారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు వెంకటసుబ్బయ్యఆచారి, భాస్కర్ రెడ్డి, సర్పంచులు, ఎంపిటిసిలు, అధికారులు పాల్గొన్నారు.

# అల్ట్రాటెక్ పరిశ్రమ వద్ద ఉద్రిక్తత

### ఉద్యోగుల విధులను అడ్డుకున్న ప్యాకింగ్ ప్లాంట్ కార్మికులు
### కార్మికులకు కూటమి నాయకుల మద్దతు
### పోలీసుల రంగ ప్రవేశంతో సద్దుమణిగిన వివాదం

పరిశ్రమ వద్ద గుమ్మిగూడిన కార్మికులు, ఉద్యోగులు

**ప్రజాశక్తి-ఎర్రగుంట్ల**

పట్టణంలోని అల్ట్రాటెక్ సిమెంట్ పరిశ్రమ వద్ద సోమవారం కార్మికులు, ఉద్యోగులు ఘర్షణ పడే స్థాయికి రావడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పరిశ్రమలో పనిచేస్తున్న 48 మంది ప్యాకింగ్ ప్లాంట్ కార్మికులు తమకు వేతనాలు పెంచాలని కోరుతూ ఐదు రోజులుగా ఆందోళన చేస్తున్న విషయం తెలిసిందే. వీరికి కూటమి నాయకులు మద్దతు తెలిపారు. అల్ట్రాటెక్ సంస్థ నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో కార్మికులు ఉద్యోగుల విధులను అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఇందులో భాగంగా సోమవారం ఉదయం సిమెంట్ పరిశ్రమలో పనిచేస్తున్న ఉద్యోగులు మెయిన్ గేటు నుంచి లోనికి వెళ్లే ప్రయత్నం చేయగా కార్మికులు, కూటమి నాయకులు వారిని అడ్డుకున్నారు. ఈ క్రమంలో మెయిన్ గేట్ వద్ద కొంత సమయం ఉద్రిక్త నెలకొంది. పోలీసులు పెద్ద గొడవకు దారి తీయకుండా అడ్డుకుని సర్దిచెప్పారు. చేసేదేమీ లేక ఉద్యోగులు, కార్మికులు వెనుదిరిగి వెళ్లిపోయారు. ఎటువంటి ఘర్షణలు తలెత్తకుండా ముందస్తుగా పోలీసులను పెద్ద ఎత్తున మోహరించారు. ఇదిలా ఉండగా ఐదురోజులుగా రేయింబవళ్లు కార్మికులు, కూటమి నాయకులు మెయిన్ గేటు వద్దనే ఉంటూ ఆందోళన చేస్తున్నారు. అక్కడే టిఫిన్లు భోజనాలు తెప్పించుకొని తింటున్నారు. కార్మికులకు రూ. 470 నుంచి 800 రూపాయలకు వేతనాన్ని పెంచాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులతో సమానంగా క్యాంటీన్, హాస్పిటల్, పాఠశాల సౌకర్యం కల్పించాలని కోరారు. తమ డిమాండ్లను పరిష్కరించే వరకు వెనక్కి తగ్గేది లేదని కూటమి నాయకులు, కార్మికులు అంటున్నారు. కార్యక్రమంలో కార్మికులతోపాటు, టిడిపి మండల ఇన్‌ఛార్జి మోహన్ రెడ్డి, కూటమి నాయకులు కత్తిప్రతాప్ రెడ్డి, పెద్దసేటు, రాజారెడ్డి, జాకట విజయ శేఖర్, రమేష్ రెడ్డి, మస్తాన్, జంగం రెడ్డి పాల్గొన్నారు.

## ఉజ్వల భవిష్యత్తుకు షైనింగ్ స్టార్స్ అవార్డులు : కలెక్టర్

**ప్రజాశక్తి - కడప అర్బన్**

విద్యార్థికి ప్రసంసా పత్రం ఇస్తున్న కలెక్టర్

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'షైనింగ్ స్టార్స్-2025" అవార్డులు విద్యార్థుల ఉన్నత చదువులు, ఉజ్వల భవిష్యత్తుకు ప్రోత్సాహాన్ని అంది స్తాయని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి తెలిపారు. సోమవారం కడపలోని మాధవి కన్వెన్షన్ హాలులో 2024-25 విద్యా సంవత్సరంలో 10వ తరగతి, ఇంటర్‌లో జిల్లా స్థాయిలో అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు షైనింగ్ స్టార్స్-2025 పేరుతో రాష్ట్ర ప్రభుత్వం రూ.20 వేల నగదు బహుమతి, సత్కార కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా కలెక్టర్, ఎస్‌పి అశోక్ కుమార్, జెసి అదితిసింగ్, ఎమ్మెల్సీలు ఎం.వి.రామచంద్రారెడ్డి, బి.రాంగోపాల్ రెడ్డి, జిల్లా మార్కెటింగ్ కో-అపరేటివ్ సొసైటీ (డీసీఎంఎస్) చైర్మన్ జయప్రకాష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల అభ్యసనం, కృషి, పట్టుదల ఆశయాలకు రెక్కలు వచ్చిన రోజు అని అభివర్ణించారు. ప్రపంచంలో ప్రతి ఒక్కరికీ ఒక్కో ప్రతిభ ఉందని, ఆశయం ఏదైనా కావచ్చని, ఆ రంగంలో నిషాణ్ణతులుగా ఎదిగి ప్రపంచ చరిత్రలో మన పేరు లిఖించబడాలి అన్న ఆశయంతో ముం దుకు సాగాలని చెప్పారు. ఎమ్మెల్సీ ఎం.వి.రామచంద్రారెడ్డి మాట్లాడుతూ మనం ఎదుగుతూనే మన సమాజంలో తోటి వారి ఎదుగుదలను కూడా ఆకాంక్షించే మనస్తత్వాన్ని అలవర్చుకోవాలన్నారు. మరో ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి మాట్లాడుతూ తల్లిదండ్రుల ఆశలను, కలలను సఫలీకృతం చేస్తున్న విద్యార్థులకు అభినందనలు తెలిపారు. ఎస్‌పి మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రోత్సాహక కార్యక్రమం విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తుందని తెలిపారు. జెసి మాట్లాడుతూ విద్యార్థులలో ఉన్న అత్యుత్తమ ప్రతిభను గుర్తించి వారిని వెన్ను తట్టి ప్రోత్సహించేందుకే ప్రభుత్వం షైనింగ్ స్టార్స్ కార్యక్రమం నిర్వహించడం సంతోషకరమన్నారు. అనంతరం వైఎస్ఆర్ కడప జిల్లాలో 10వ తరగతి, ఇంటర్మీడియట్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 266 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ. 20వేలు చొప్పున మంజూరైన రూ. 53,20,000మెగా చెక్కును కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ అతిథులతో కలిసి అందజేశారు. అనంతరం ప్రశంసా పత్రాలు, మెడల్‌ను కలెక్టర్, ముఖ్య అతిథుల చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్‌జెడి శ్రీనివాసులు, డిఇఒ షంషుద్దీన్ కళాశాల, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, కళాశాలల లెక్చరర్లు, ఉపాధ్యాయులు, ఎంఇఒలు, విద్యార్థినీ విద్యార్థులు, తల్లిదండ్రులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పారితోషికం వెంటనే చెల్లించాలి : యుటిఎఫ్

**ప్రజాశక్తి - కడప అర్బన్**

పదవ తరగతి పరీక్షల మూల్యాంకన విధులకు సంబంధించిన పారితోషికాన్ని వెంటనే చెల్లించాలని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు కోరారు. సోమవారం జిల్లా విద్యాశాఖ అధికారి షేక్. షంషుద్దీన్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పాలెం మహేష్ బాబు మాట్లాడుతూ మార్చిలో జరిగిన పదవ తరగతి పరీక్షల విధులకు సంబంధించి చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు పరీక్షల నిర్వహణ కోసం సొంత డబ్బు ఖర్చు పెట్టుకుని విధులు నిర్వహించారని పేర్కొన్నారు. ఏప్రిల్‌లో జరిగిన పదవ తరగతి మూల్యాంకన పారితోషకం కూడా చెల్లించలేదని తెలిపారు. పరీక్షలు ముగిసి ఫలితాలు వెలుబడినప్పటికీ పారితోషికం చెల్లించడంలో అలసత్వం వహించడం మంచిది కాదన్నారు. సప్లమెంటరీ పరీక్షలు సైతం పూర్తయి మూల్యాంకనం కూడా ముగిసిందని ఫలితాలు కూడా త్వరలో వెలుబడుతున్నప్పటికీ పారితోషికం చెల్లించడంలో పూర్తి అలసత్వం ప్రదర్శిస్తున్నారని తెలిపారు. బడ్జెట్ రిలీజ్ అయినప్పటికీ బిల్లుల సమర్పించడంలో విద్యాశాఖ సిబ్బంది నిర్లక్ష్యాన్ని నివారించి వెంటనే ఉపాధ్యాయులకు పారితోషకం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారారు. లేని పక్షంలో డిఇఒ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా డిఇఒ స్పందిస్తూ వారం రోజుల్లోపు బిల్లులన్నింటినీ పరిశీలించి ఉపాధ్యాయులకు పారితోషికం చెల్లించే విధంగా సిబ్బందికి సూచనలు ఇచ్చి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షుడు వై.రవికుమార్ జిల్లా కార్యదర్శులు సి.వి.రమణ, ఏజాస్ అహమ్మద్, జిల్లా కార్యవర్గ సభ్యులు మహబూబ్ బాషా, అస్లాం బాష, పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

### మహిళలపై దాడులను అరికట్టడంలో

## కూటమి ప్రభుత్వం విఫలం

**ప్రజాశక్తి - కడప అర్బన్**

రాష్ట్రంలో రోజు రోజుకూ మహిళలు, విద్యార్థినులపై అత్యాచారాలు పెరిగిపోతున్నాయని, వాటిని అరికట్టడంలో కూటమి ప్రభుత్వం విఫలం చెందిందని ఐద్వా, డివైఎఫ్ఐ నాయకులు విమర్శించారు. సోమవారం యుటిఎఫ్ భవన్‌లో విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా అధ్యక్షులు ఐ. ఎన్.సుబ్బమ్మ, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శుల ంముడియం.చిన్ని, వీరణాల. శివకుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలు, విద్యార్థినులపై దాడులు, అత్యాచారాలు అధికమయ్యాయని పేర్కొన్నారు. అందుకు సత్యసాయి జిల్లా, అనంతపురం జిల్లాలో సంఘటనలే కారణమన్నారు. పాలక ప్రభుత్వాలు మహిళా రక్షణ కోసం తాము ఉన్నామని గొప్పలు చెప్పుకుంటున్నాయే తప్ప అది ఆచరణ సాధ్యం లో లేదన్నారు. రాష్ట్ర మంత్రి మహిళ ఉన్నా దాడులను, అత్యాచారాలను అరికట్టలేక పోయారన్నారు. బలమైన చట్టాలు, శిక్షలు అమలు జరిగినప్పుడే అత్యాచారాలు ,దాడులు ఆగుతాయని చెప్పారు. దేశంలో అటువంటి శిక్షలు అమలు కావడం లేదన్నారు. ప్రస్తుతం మహిళలకు, విద్యార్థినులకు గుడిలో, బడిలో, ఇంట్లో, బయట ఎక్కడా రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు మహిళా రక్షణ చట్టాలు రూపొందించాలన్నారు. అనంతపురంలో ఇంటర్ విద్యార్థినిపై అత్యంత కిరాతకంగా పెట్రోల్ పోసి చంపడం దారుణమన్నారు. నిందితులను ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అత్యాచార నిందితులను కఠినంగా శిక్షించి మహిళలకు, విద్యార్థినులకు రక్షణ కల్పించాలని కోరారు. సమావేశంలో డివైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆదిల్,నగర కార్యదర్శి విజయ్,ఐద్వా జిల్లా నాయకులు అనంతమ్మ, దుర్గమ్మ పాల్గొన్నారు.

## వెబ్ కౌన్సెలింగ్‌ను అంగీకరించే ప్రసక్తే లేదు

**ప్రజాశక్తి - కడప అర్బన్**

రిలే దీక్షల్లో ఉపాధ్యాయులు

ఎస్‌జిటిలకు వెబ్ కౌన్సెలింగ్ విధానంలో బదిలీలు నిర్వహించాలనే నిర్ణయాన్ని వెనక్కు తీసుకునే వరకు ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఉద్యమిస్తూనే ఉంటామని ఐక్య వేదిక నాయకులు రఘునాథరెడ్డి, లక్ష్మి రాజా, పాలెం మహేష్ బాబు, శివారెడ్డి తెలిపారు. సోమవారం డిఇఒ కార్యాలయం ఎదుట నిరాహార దీక్షలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్‌జిటిలకు మాన్యువల్ కౌన్సెలింగ్ ద్వారా బదిలీలు నిర్వహిస్తామని ఉపాధ్యాయ సంఘాల సమావేశంలో ప్రభుత్వం హామీ ఇచ్చిందని తెలిపారు. ఇచ్చిన హామీని అమలు పరచకుండా మోసపూరితంగా వ్యవహరించడం మంచిది కాదని చెప్పారు. విద్యాశాఖ మంత్రి అంగీకరించినట్లు కల్లిబొల్లి మాటలు చెప్పి నాటి ఉద్యమాన్ని నీరుగార్చాని పేర్కొన్నారు. ఒక ఉపాధ్యాయుడు 2,500 స్థానాలను వెబ్ ఆప్షన్ ద్వారా ఎంపిక చేసుకోవడం ఎంతో కష్టతరమని, ప్రభుత్వం ఈ విషయాన్ని గమనించి వెంటనే మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించేలాగున చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో మంగళవారం మంగళగిరిలోని రాష్ట్ర విద్యా భవన్ ముట్టడి చేస్తామని తెలిపారు. నిరసన కార్యక్రమంలో ఎస్టియు జిల్లా అధ్యక్షులు ఇలియాస్ బాష, పిఆర్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి శివారెడ్డి, యుటిఎఫ్ నాయకులు రవికుమార్, నరసింహారావు, కృష్ణారెడ్డి, ఏపీటీఎఫ్ నాయకులు ఖాదర్ బాషా, అబ్దుల్లా, జమాల్ రెడ్డి, నాగేశ్వరరావు,తిరుపాల్, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు. నిరాహార దీక్షలో మల్లు రఘునాథ రెడ్డి, కందుల వెంకట సుబ్బారెడ్డి, వీర నారాయణ, అజీజుద్దీన్, జగన్మోహన్ రెడ్డి, సుబ్బారెడ్డి, వెంకటనాగేంద్ర, బాల గురివిరెడ్డి, సుబ్బనరసయ్య, కరీముల్లా కూర్చున్నారు.

పిల్లలతో మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయులు అరుణ

## ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించండి

**ప్రజాశక్తి - సింహాద్రిపురం**

ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయిలో విద్య బోధన లభిస్తుందని ప్రధానోపాధ్యాయురాలు అరుణ పేర్కొన్నారు. మండలంలోని అంకాలమ్మ గూడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు కామసముద్రం, అంకాలమ్మ గూడూరు గ్రామాల్లో ఇంటింటికి తిరుగుతూ తమ పిల్లలనుప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చేర్పించండి.. పిల్లల భవిష్యత్‌కు తాము భరోసా ఇస్తామని తెలిపారు. పాఠశాలలో నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులు, విద్యార్థుల పట్ల శ్రద్ధ, సదుపాయాలను తల్లిదండ్రులకు, వివరించారు. ప్రచార కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీదేవి, రాజమోహన్ రెడ్డి, మల్లేష్, ద్వారకనాథ్ రెడ్డి పాల్గొన్నారు.

మహిళలకు అవగాహన కల్పిస్తున్న సిడిపిఒ సునీత

## ఆటపాటలతో బోధన అవసరం : సిడిపిఒ

**ప్రజాశక్తి - వేంపల్లె**

పిల్లలు శారీరకంగా, మానసికంగా, ఉల్లాసంగా ఉండేందుకు అయిదేళ్లు నిండిన పిల్లలందరినీ అంగన్వాడీ పాఠశాలలో చేర్పించాలని ఐసిడిఎస్ సిడిపిఒ సునీత కోరారు. సోమవారం స్థానిక రాజీవ్ నగర్ కాలనీలో ఉన్న అంగన్వాడీ కేంద్రంలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో అంగన్వాడీ పిలుస్తోంది అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఒ మాట్లాడుతూ ప్రీ స్కూల్ పిల్లలకు ముఖ్యంగా శారీరకంగా, మానసికంకంగా, ఉల్లాసం కలిగించేలా అంగన్వాడీ కేంద్రంలో ఆటపాటల ద్వారా విద్యను నేర్పిస్తున్నట్లు తెలిపారు. అంగన్వాడీలకు పిల్లలను పంపిస్తే పాఠశాలకు వెళ్లడానికి అలవాటు పడి 1వ తరగతిలో చేరడానికి సంసిద్ధులు అవుతారని వివరించారు. ప్రయివేటు, కార్పోరేట్ పాఠశాలల్లో పిల్లలకు అధిక మొత్తంలో ఫీజులు వసూలు చేసి, ఎక్కువ ఒత్తిడికి గురి చేస్తున్నారని చెప్పారు. అంగన్వాడీల ద్వారా పిల్లలకు ఆటపాటల ద్వారా విద్యను బోధించటమే కాకుండా వారికి పౌష్టికాహారమైన పాలు, గుడ్లు, భోజనం అందిస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకొని పిల్లలను అంగన్వాడీ కేంద్రాలకు పంపాలని కోరారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు స్వర్ణలత, అంగన్వాడీ కార్యకర్త శైలజా, అంగన్వాడీ సహాయకురాలు, మహిళలు పాల్గొన్నారు.



ఆలయ ప్రాంగణంలో ఉత్సవ కమిటీ సభ్యులు, మాజీ ఇఒ ముకుందారెడ్డి

## అన్నదాన సత్రానికి రూ.44 వేలు విరాళం

**ప్రజాశక్తి - చాపాడు**

అల్లాడుపల్లెలో వెలసిన వీరభద్ర స్వామి దేవస్థానానికి చెందిన భద్రకాళి సమేత వీరభద్ర స్వామి అన్నదాన సత్రంలో అన్నదాన కార్యక్రమానికి భక్తుల నుండి రూ.44,952 విరాళాలు వచ్చాయని ఆలయ ఇఒ శ్రీనివాసులు తెలిపారు. కర్నూలు వాస్తవ్యులు దాచూరి వినయ్‌కుమార్ రూ.20,001, తొండూరు గ్రామానికి చెందిన అలవలపాటి ముకుందారెడ్డి రూ.10,116, తొండూరుకు చెందిన అలవాలపాటి గౌతమ్‌రెడ్డి రూ.10,116, ఇతర భక్తుల ద్వారా కొంత విరాళాలు వచ్చాయని తెలిపారు. ఈ సందర్భంగా పెరుగు వీరనారాయణ యాదవ్ మాట్లాడుతూ అల్లాడుపల్లె దేవళాలు అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. అందులో భాగంగా ప్రతి సోమవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. దాతలు సహకరించాలన్నారు. ముందుగా స్వామివారికి ప్రత్యేక పూజలు, పల్లకీసేవ నిర్వహించారు. అన్నదాన కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు పెరుగు వీర నారాయణ యాదవ్, రాసుపల్లె వీరారెడ్డి, గోసుల వీరారెడ్డి, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## యోగాతో శారీరక దృఢత్వం

**ప్రజాశక్తి - ముద్దనూరు**

యోగాతో శరీర దృఢత్వం, మానసిక పునరుత్తేజానికి దోహద పడుతుందని ఎంపిడిఒ పరిపూర్ణ అరుంధతి తెలిపారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా సోమవారం పరిపూర్ణ అరుంధతి ఆధ్వర్యంలో స్థానిక పంచాయతీ కార్యాలయం నుంచి పాత బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ రోజూ యోగా చేయడం అలవాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ వీరభద్రుడు, ఎపిఒ గంగయ్య, ఎపిఎం అపర్ణ, సిసి ఇబ్రహీం, పిహెచ్‌సి సిహెచ్ఒ ప్రసాద్ యాదవ్, డ్వాక్రా సంఘాల మహిళలు, సిబ్బంది పాల్గొన్నారు.

**ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) :** రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి సమక్షంలో కొత్తపల్లె పంచాయతీ, కడప జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు కొనిరెడ్డి శివచంద్రారెడ్డి ఆధ్వర్యంలో యోగాంధ్ర ర్యాలీ నిర్వహించారు. సోమవారం కొత్తపల్లి పంచాయతీ, గోపవరం పంచాయతీ కార్యాలయాల నుండి విడివిడిగా భారీ ర్యాలీ నిర్వహించారు. డిఎల్‌డిఒ సుబ్రహ్మణ్యం, సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీవో సూర్యనారాయణ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి రామ్మోహన్ రెడ్డి, వార్డ్ మెంబర్ కొనిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి, షాబీర్, ఖాదరబాద్ టిడిపి నాయకులు మీనిగ వెంకట సుబ్బయ్య, జింకా రమణమూర్తి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

**వేముల :** వేముల సచివాలయం పరిధిలో యోగా ర్యాలీని సోమవారం ఎంపీడీవో రాధాకృష్ణవేణి నిర్వహించారు. ముఖ్యఅతిథిగా టిడిపి నాయకుడు శేషారెడ్డి, పులివెందుల డిఎల్‌డిఒ విజయలక్ష్మి, తహశీల్దార్ ఇందిరా రాణి యోగా దినోత్సవం సందర్భంగా ముందుగా సచివాలయం దగ్గర నుంచి వేముల బస్టాండ్ వరకు ర్యాలీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఏపీవో పుష్పలత, ఏపీఎం ఆంజనేయులు, సర్పంచ్ సాకే రామాంజనేయమ్మ, ఇతర శాఖల అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

**ప్రజాశక్తి - ఖాజీపేట**

స్థానిక టీచర్స్ కాలనీలోని శ్రీసాయి విద్యా మందిర్ పాఠశాలలో మంగళవారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించనున్నారు. మా కేర్ ఐ హాస్పిటల్ కడప వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ప్రముఖ కంటి వైద్యులు డాక్టర్ దినేష్ పాల్గొంటారని, మధ్యాహ్న మూడు గంటల నుంచి సాయంత్రం ఐదున్నర వరకు పరీక్షలు చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ అవకాశాన్ని గ్రామీణ ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

# గాలివానకు నేలకొరిగిన అరటి తోటలు

### రూ.1.30 కోట్లు నష్టం వాటిల్లినట్లు ఉద్యాన శాఖాధికారుల ప్రాథమిక అంచనా

**ప్రజాశక్తి - సింహాద్రిపురం**

మండల వ్యాప్తంగా ఆదివారం సాయంత్రం వీచిన భారీ గాలులకు 110 ఎకరాల్లో అరటి తోటలు దెబ్బతిన్నాయని ముద్దనూరు ఉద్యానవన శాఖ అధికారి మల్లేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం సింహాద్రిపురం, గురజాల, హిమకుంట్ల గ్రామాల్లో దెబ్బతిన్న అరటి తోటలను మండల వ్యవసాయ శాఖ అధికారి శివమోహన్‌రెడ్డితో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం మల్లేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ 42 మంది రైతులకు సంబంధించి 110ఎకారల్లో అరటి తోటలు దెబ్బతిన్నాయన్నారు. దాదాపు రూ1.30 కోట్లు నష్టం వాటిల్లినట్లు ప్రాథమిక అంచనాకు వచ్చామన్నారు. మరిన్ని గ్రామాల్లో ఇంకా రైతుల నుంచి సమాచారం వస్తుందని, పూర్తిస్థాయి సమాచారం రాగానే ప్రభుత్వానికి పంట నష్ట పరిహారానికి నివేదిక పంపిస్తామన్నారు. గాలులకు దెబ్బతిన్న తోటల రైతుల సమాచారాన్ని సమీపంలోని ఆర్ఎస్‌కె సిబ్బందికి తెలియజేయాలని రైతులకు సూచించారు. పరిశీలనలో రెవెన్యూ శాఖ అధికారులు, ఆర్ఎస్‌కె సిబ్బంది పాల్గొన్నారు.

దెబ్బతిన్న అరటి తోటలను పరిశీలిస్తున్న ఉద్యానశాఖాధికారి

# మహిళలపై కృష్ణంరాజు వ్యాఖ్యలు గర్హనీయం

**- రాజధాని అమరావతిని ఫ్రీజోన్‌గా ప్రకటించాలి : తులసిరెడ్డి**

**ప్రజాశక్తి - వేంపల్లె**

ఓ ఛానల్ చర్చా వేదికలో కృష్ణంరాజు అనే జర్నలిస్టు, విశ్లేషకుడు రాజధాని అమరావతిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమని పిసిసి రాష్ట్ర అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ విశ్లేషకుడుకృష్ణంరాజు చేసిన వ్యాఖ్యలు రాజధాని అమరావతిని కించపరచడమే కాకుండా మహిళా లోకాన్ని అవమానించడమే అవుతుందన్నారు. కృష్ణంరాజు, సాక్షి యాజమాన్యం ఈ వ్యాఖ్యలను ఉపసంహరించుకుని రాష్ట్ర ప్రజలకు, ప్రత్యేకించి మహిళా లోకానికి క్షమాపణ చెప్పాలని తులసిరెడ్డి డిమాండ్ చేశారు. రాజధాని అమరావతి ప్రాంతాన్ని ఫ్రీ జోన్‌గా ప్రకటించాలని కూటమి ప్రభుత్వాన్ని కోరారు. విద్యా, ఉద్యోగాలలో స్థానిక, స్థానికేతరకు సంబంధించి రాష్ట్రాన్ని 4 జోన్లుగా విభజించారని చెప్పారు. పాత జిల్లాలైన శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాలు మొదటి జోన్ పరిధిలోకి, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణ జిల్లాలు రెండవ జోన్ పరిధిలోకి, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాలు మూడవ జోన్ పరిధిలోకి, కడప, కర్నూల్, అనంతపురం, చిత్తూర్ జిల్లాలు నాల్గవ జోన్ పరిధిలోకి వస్తాయన్నారు. రాజధాని అమరావతి ప్రాంతం మూడవ జోన్ పరిధిలోకి వస్తుందని తెలిపారు. రాజధాని అన్ని ప్రాంతాలకు సంబంధించింది కాబట్టి అందరికీ సమాన అవకాశాలు రావాలంటే ఆ ప్రాంతాన్ని ఫ్రీ జోన్‌గా ప్రకటించాలని వివరించారు. ఉమ్మడి రాష్ట్రంలో కూడా రాష్ట్రస్థాయి కార్యాలయాలను ఫ్రీ జోన్‌గా ప్రకటించి అందరికీ సమాన అవకాశాలు కల్పించారన్నారు.

# రేషన్ బియ్యం ఇవ్వలేదని ఆందోళన

బాధితులతో ఇన్‌ఛార్జి డీటీకి ఫిర్యాదు చేస్తున్న కౌన్సిలర్ ఎరికలరెడ్డి

**ప్రజాశక్తి - ఎర్రగుంట్ల**

పట్టణంలో 17వ వార్డు ఏడవ నెంబర్ రేషన్ షాపులో రేషన్ బియ్యం ఇవ్వకపోవడంతో పలువురు లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక కౌన్సిలర్ ఎరికలరెడ్డి ద్వారా రాత పూర్వక ఫిర్యాదును ఇన్‌ఛార్జి డిప్యూటీ తహశీల్దార్‌కు అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ నిరుపేదలైన తమకు తినేందుకు ఖచ్చితంగా రేషన్ బియ్యం కావాలని అన్నారు. రేషన్ షాపు వద్దకు వెళితే మీ కోట రాలేదని.. మీ కుటుంబంలో ఎందరున్నా ప్రస్తుతం మూడు కిలోలు మాత్రమే బియ్యం ఇస్తామని చెప్పారన్నారు. ఆ మూడు కిలోలు తాము తీసుకోలేదని లబ్ధిదారులు వాపోయారు. ఎరికలరెడ్డి మాట్లాడుతూ లబ్ధిదారులతో తహశీల్దార్ కార్యాలయానికి వెళ్లామని, అక్కడ ఎవరూ స్పందించడం లేదన్నారు. సర్వేయర్‌కు డీటీ బాధ్యతలు అప్పజెప్పారన్నారు. ఆయన తనకేమీ తెలియదని అంటున్నాడని పేర్కొన్నారు. తమ వార్డులో 15 మంది కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి కేవలం మూడు కిలోలు బియ్యం మాత్రమే వచ్చాయన్నారు. నిరుపేద కుటుంబాల వారికి వెంటనే రేషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

# విత్తన ఎంపికకు ప్రాధాన్యతనివ్వాలి

చిలమకూరు గ్రామంలో మాట్లాడుతున్న ప్రధాన శాస్త్రవేత్త బాలకృష్ణ

**ప్రజాశక్తి - ఎర్రగుంట్ల**

విత్తనాల ఎంపికకు రైతులు ప్రాధాన్యతనివ్వాలని ప్రధాన శాస్త్రవేత్త బాలకృష్ణ సూచించారు. మండలంలోని సిరాజ్‌పల్లె, మల్లెపాడు, పోట్లదుర్తి, చినదండ్లూరు, తిప్పలూరు, నిడ్జి, చిలమకూరు, ఎర్రగుంట్ల, సుంకేసుల గ్రామాల్లో వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలోజాతీయ చిరుధాన్యాల పరిశోధనా సంస్థ హైదరాబాద్ నుంచి వచ్చిన సుబ్బరాయుడు, శ్యాం ప్రసాద్, ఉమా మాట్లాడారు. చిరుధాన్యాల రకాలు, గడ్డిజాతుల రకాలు, వాటి ఉపయోగాల గురించి వివరించారు. వ్యవసాయ సంచాలకులు నరసింహారెడ్డి మాట్లాడుతూ వరి, కొర్ర, మినుము, పత్తి, శనగ పంటల గురించి రైతులకు వివరించారు. ఏ సీజన్‌లో ఏ పంటలు వేసుకోవాలి అనే దానిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పశు వైద్యాధికారులు జ్యోత్స్న, మహేశ్వర్ రెడ్డి, ఎఒ శ్రీకాంత్ రెడ్డి, గ్రామాల విఎఎలు, విహెచ్ఎలు, ఎహెచ్ఎలు, రైతులు పాల్గొన్నారు.

### రాయితీ విత్తనాలకు దరఖాస్తు చేసుకోండి

**ప్రజాశక్తి - లింగాల**

నలభై శాతం రాయితీతో ఖరీఫ్‌లో పంటల సాగు కోసం రైతులు దరఖాస్తు చేసుకోవాలని ఎఒ రమేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విత్తనాల కోసం రైతులు సంబంధిత రైతు సేవా కేంద్రంలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. వేరుశనగ, కంది సాగు చేసే రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## ప్రతిభ పురస్కారాలు అందుకున్న శ్రీవిద్య విద్యార్థులు

**ప్రజాశక్తి - ప్రొద్దుటూరు( పుట్టపర్తి సర్కిల్)**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రకటించిన 2025 ప్రతిభ అవార్డులకు స్థానిక సూపర్ బజార్ రోడ్డు లోని శ్రీవిద్యా జూనియర్ కాలేజీ విద్యార్థులు ప్రతిభా పుర స్కారాలు అందుకున్నట్లు ప్రిన్సిపల్ కెవిఒ రమణారావు తెలిపారు. ఈ సం దర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపీసీ విభాగంలో వై గీతాంజలి 991, బైపీసీ విభాగంలో వై సఫియా 990 మార్కులతో జిల్లా నుండి శ్రీవిద్య జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ అవార్డులు కలెక్టరు, ఎమ్మెల్సీ చేతుల మీదుగా అందుకున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించినట్లు ప్రతిభా పురస్కారం, గోల్డ్ మెడల్, రూ.20,000 నగదు బహుమతి అందజేశారన్నారు. ప్రతిభ వార్డులను అందుకున్న విద్యార్థినులకు కళాశాల డైరెక్టర్లు ఎస్.శ్రీకాంత్ కుమార్ రెడ్డి, ఎం రామ్మోహన్, దస్తగిరి, అధ్యాపకులు అభినందించారు.

విద్యార్థులతో ఎమ్మెల్సీ, కళాశాల డైరెక్టర్లు శ్రీకాంత్‌రెడ్డి, రామ్మోహన్

## బ్రౌన్ గ్రంథాలయానికి పుస్తకాల బహూకరణ

**ప్రజాశక్తి - కడప అర్బన్ :** అనంతపురం పట్టణానికి చెందిన ప్రసిద్ధ సాహిత్య విమర్శకులు, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత, సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సలహామండలి సభ్యులు ఆచార్య రాచపాళెం చంద్రశేఖరరెడ్డి 1200 పుస్తకాలను సోమవారం ఎల్ఐసి. కాలనీలోని తమ నివాసగృహంలో సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం గ్రంథాలయ సహాయకులు జి.హరిభూషణరావు, సిబ్బంది సి.నీలకంఠేశ్వర్, బి.హరికృష్ణకు అందజేశారు. ఈ సందర్భంగా సంచాలకులు ఆచార్య జి.పార్వతి మాట్లాడుతూ యోగి వేమన విశ్వవిద్యాలయంలో తెలుగు ఆచార్యులుగా, సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం బాధ్యులుగా పనిచేసిన ఆచార్య రాచపాళెం చంద్రశేఖర రెడ్డి గతంలో కూడా కొన్ని వందల పుస్తకాలను బ్రౌన్ గ్రంథాలయానికి బహూకరించారన్నారు. ప్రస్తుతం బహూకరించిన అమూల్యమైన గ్రంథాల్లో సిద్ధాంతవ్యాసాల సంపుటాలు, 'చిందోళ్ల చరిత్ర%-సంస్కృతి-సాహిత్యం', 'ముళ్లపూడి వెంకటరమణ రచనలు-సమగ్ర పరిశీలన', 'స్మరనారాయణీయం', 'గుమ్మి', 'తిరుమల చరిత్ర' కథ,నవల,కవితా సంపుటాలు ఉన్నాయన్నారు. గ్రంథాలయానికి పుస్తకాలను బహూకరించిన ఆచార్య రాచపాళెం చంద్రశేఖర రెడ్డిని యోగి వేమన విశ్వవిద్యాలయం ఇన్‌ఛార్జ్ వైస్‌ఛాన్సలర్ ఆచార్య అల్లం శ్రీనివాసరావు, ఇన్‌ఛార్జ్ రిజిస్ట్రార్ ఆచార్య పుత్తా పద్మ అభినందించారు. సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డా.చింతకుంట శివారెడ్డి, డా.భూతపురి గోపాలకృష్ణశాస్త్రి, గ్రంథాలయ సహాయకులు ఎన్.రమేశ్‌రావు, జూనియర్ అసిస్టెంట్లు ఆర్.వెంకటరమణ, ఎం.మౌనిక, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

## అధ్వానంగా నెర్రవాడ - నాగాయపల్లె రోడ్డు

**ప్రజాశక్తి - చాపాడు**

మండల పరిధిలోని నెర్రవాడ గ్రామం నుంచి నాగాయపల్లె గ్రామానికి వెళ్లే రహదారి చాలా అధ్వానంగా ఉంది. ఈ రహదారికి ప్రభుత్వం గతంలో నిధులు మంజూరు చేసి రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపట్టింది. కొంతమంది నిర్మాణ పనులకు అభ్యంతరం తెలపడంతో పనులు ఆగి పోయాయి. పంట పొలాలకు వెళ్లే ఈ దారి పూర్తిగా గుంతల మయంగా తయారైంది. ఈ మార్గాన నాగాయపల్లె, మొర్రాయపల్లె, సిద్ధారెడ్డిపల్లె, సోమాపురం, బద్రిపల్లె గ్రామాల రైతులు పంట పొలాలకు వెళ్లే అవకాశం ఉంది. రహదారి అధ్వానంగా ఉండడంతో రైతులు దిగుబడులు వచ్చిన సందర్భంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రైతులకు ఉపయోగపడే ఈ రహదారిని పూర్తిస్థాయిలో బాగు చేయాలని కోరుతున్నారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో రహదారి చాలా అధ్వానంగా తయారైంది. ముఖ్యంగా నెర్రవాడ సమీపంలో బురద గుంతలు ఏర్పడి ద్విచక్ర వాహనాలు వెళ్లేందుకు కూడా అనువుగా లేదు. ఈ దారి బాగైతే పలు గ్రామాల ప్రజలు, రైతులకు చాలా ఉపయోగకరంగా ఉంటుంది.

### జాతీయ స్థాయి ఓపెన్ చెస్ టోర్నీలో
## జిల్లా క్రీడాకారుల సత్తా

**ప్రజాశక్తి - కడప**

బహుమతులు సాధించిన విద్యార్థులు

నెల్లూరులోని నక్షత్ర స్కూల్‌లో నిర్వహించిన 'జాతీయ స్థాయి ఓపెన్ చెస్ టోర్నమెంట్"లో వైఎస్సార్ కడప జిల్లా చెస్ క్రీడాకారులు గొప్ప విజయాలు సాధించారు. వివిధ విభాగాల్లో మొత్తం ఐదు బహుమతులు గెలుచుకుని జిల్లా గౌరవాన్ని పంచుకున్నారు. ఈ టోర్నమెంట్ లో వైఎస్ఆర్ కడప జిల్లాకు చెందిన చెస్ క్రీడాకారులు అండర్- 6 బాలుర విభాగంలో దీక్షిత్ 4వ స్థానంలో, అండర్-8 బాలికల విభాగంలో లాస్య ప్రియ 2వ స్థానంలో, అండర్-8 బాలుర విభాగంలో ప్రణవ్ స్వరూప్ 5వ స్థానంలో, అండర్-10 బాలికల విభాగంలో ధనిత 4వ స్థానం లో, 50 ఏళ్లకు పైబడిన వయో వర్గంలో అనీస్ దర్బారి 1వ స్థానం నిలిచి బహుమతులను కైవసం చేసుకున్నారు.

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న పి.రవీంద్రనాథ్‌రెడ్డి

## రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోంది

**ప్రజాశక్తి - పులివెందుల టౌన్**

రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందని, అక్రమం కేసులు పెట్టడం తప్ప అభివృద్ధి చేయడం లేదని వైసిపి జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. సోమవారం టిడిపి తోరణాలు తొలగించిన కేసులో నిందితులుగా ఉన్న వైసిపి నాయకులను పట్టణ పరిధిలోని సబ్‌జైల్లో ఆయన కలిశారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రవీంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది దాటినా రాష్ట్రానికి, ప్రజలకు కానీ చేసింది ఏమీ లేదని విమర్శించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని పేర్కొన్నారు. వైసిపి కోసం పనిచేసే వారిపై అక్రమ కేసులు. ఎస్సీ ఎస్టీ కేసులు పెట్టి బెయిల్ రాకుండా మానసికంగా వేధిస్తున్నారని తెలిపారు. రాజకీయ పార్టీలు చూడకుండా అందరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత వైఎస్ జగన్మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. వైఎస్ జగన్ పాలన పారదర్శకంగా జరిగిందన్నారు. అత్యాచారాలు మితిమీరి పోయాయన్నారు. ఇప్పటికైనా అధికారులు న్యాయం వైపు ఉండి పని చేయాలన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎఇకి వినతిపత్రాన్నిస్తున్న రైతు సంఘం నాయకులు

## అదనపు విద్యుత్ ఛార్జీలను తగ్గించాలి

**ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు)**

అదనపు విద్యుత్ ఛార్జీల విధానాన్ని తొలగించాలని రైతు సేవా సమితి జిల్లా అధ్యక్షులు ఎవి రమణ కోరారు. ఆ మేరకు సోమవారం మైదుకూరు ట్రాన్స్ కో ఎఇ రామభద్రయ్యకు అధిక విద్యుత్ ఛార్జీలను రద్దు చేయాలని కోరుతూ వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా సర్దుబాటు ఛార్జీల పేరుతో గత మూడునాలుగేళ్ల పెండింగ్ బిల్లులను సామాన్యుడిపై భారం మోపుతోందన్నారు. విద్యుత్ ఛార్జీల కంటే అదనంగా అధిక బిల్లులు వేశారని, ఈ విధానాన్ని తొలగించాలని కోరారు. కార్యక్రమంలో రైతు సేవా సమితి మైదుకూరు పట్టణ శాఖ అధ్యక్ష కార్యదర్శులు కె.రామ్మోహన్, చెక్‌పోస్ట్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

## రఘునాథరెడ్డికి డాక్టరేట్ ప్రదానం

**ప్రజాశక్తి - పులివెందుల రూరల్**

ఎపి విభిన్నప్రతిభావంతుల నెట్ వర్క్ రాష్ట్ర అధ్యక్షులు ఇరికిరెడ్డి రఘు నాథరెడ్డి

పులివెందులకు చెందిన ఎపి విభిన్నప్రతిభావంతుల నెట్ వర్క్ రాష్ట్ర అధ్యక్షులు ఇరికిరెడ్డి రఘు నాథరెడ్డికి అనంతపురం శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసింది. వైఎస్ఆర్ జిల్లాలోని విభిన్న ప్రతిభావంతుల సామాజిక, ఆర్థిక స్థితిగతులపై శ్రీకృష్ణదేవరాయ విశ్వ విద్యాలయం, సోషియల్ ఎక్స్‌క్లూజివ్ అండ్ ఇంక్లూజివ్ పాలసీ డిపార్ట్మెంట్ రీసెర్చ్ సూపర్వైజర్ ప్రొఫెసర్ కె.వెంకటరెడ్డి పర్యవేక్షణలో పరిశోధన పత్రాన్ని సమర్పించినందుకు ఆయనకు డాక్టరేట్ పట్టా ప్రదానం చేసింది. ఈ సందర్భంగా రఘునాథరెడ్డి మాట్లాడుతూ 30ఏళ్లుగా విభిన్నప్రతిభావంతుల సంక్షేమం కోసం కృషి చేస్తున్న తాను పులివెందుల నియోజకవర్గంలోని విభిన్నప్రతిభావంతుల సామాజిక, ఆర్థిక స్థితిగతులు అనే అంశంపై ఎస్‌కె యూనివర్శిటీలో ఎంఫిల్ కోర్సు పూర్తిచేశానని, తదనంతరం వైఎస్ఆర్ జిల్లా విభిన్నప్రతిభావంతుల స్థితిగతులపై పిహెచ్‌డి కోర్సు కోసం ఏడు సంవత్సరాల పాటు పరిశోధన చేశానన్నారు. యూనివర్సిటీ స్నాతకోత్సవ సందర్భంగా గవర్నర్ చేతుల మీదుగా డాక్టరేట్ పట్టా అందజేస్తారని తెలిపారు. కష్టానికి, తగిన ప్రతిఫలం లభించినట్లని రఘునాథరెడ్డి పేర్కొన్నారు. తన పరిశోధనకు సంపూర్ణ సహాయసహకారాలు అందజేసిన ప్రొఫెసర్ వెంకటరెడ్డి, డిపార్ట్మెంట్ డైరెక్టర్ తదితరులకు ధన్యవాదాలు తెలిపారు. రఘునాథరెడ్డికి డాక్టరేట్ లభించడం పట్ల విభిన్నప్రతిభావంతులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

## నేటి నుంచి ఆధార్ క్యాంపులు

**- పులివెందుల మున్సిపల్ కమిషనర్ డి.రాముడు**

**ప్రజాశక్తి - పులివెందుల టౌన్**

రాష్ట్రంలో ఆధార్ కార్డులు చాలావరకు బయోమెట్రిక్ అప్డేషన్, డాక్యుమెంట్ అప్డేషన్ పెండింగ్‌లో ఉన్నందున రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వుల మేరకు ఆధార్ స్పెషల్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు పులివెందుల మున్సిపల్ కమిషనర్ డి.రాముడు ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం నుంచి శుక్రవారం వరకు.. ఈనెల 24 నుంచి 27వ తేదీ వరకు పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని నిర్దేశించిన సచివాలయాల్లో ఆయా పరిధిలోని అంగన్వాడీ సెంటర్లలో బాల బాలికలకు ఆధార్ నమోదు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈనెల 10న ఎస్‌బిఐ కాలనీ, చిన్న రంగాపురం సచివాలయాల్లో, 11న రాజీవ్ కాలనీ, పెద్ద కొండప్ప కాలనీ సచివా లయాల్లో, ఈనెల 12న అంకాలమ్మ పేట, ప్రశాంతినగర్ సచివాల యాల్లో, 13న కే.వెల మవారిపల్లె, బాకరాపురం సచివాలయాల్లో, 24న వెంకటాపురం, నగరిగుట్ట, శ్రీరామ టెంపుల్ సచివాలయాల్లో, 25న గుంత బజార్, మిస్సమ్మ బంగ్లా సచివాలయాల్లో, 26న బయమ్మ తోట, సీయోనుపురం సచి వాలయాల్లో, 27న పెద్ద రంగాపురం, ఉలిమెల్ల సచి వాలయాల్లో ఆధార్ స్పెషల్ క్యాంపులు నిర్వహిస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని పులివెందుల పట్టణ ప్రజలు సద్వినియోగం చేసు కోవాలని కమిషనర్ రాముడు కోరారు.

**మహారాజశ్రీ గౌరవ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, కమలాపురం**

**ఐ.ఏ.నెం.352/2024**
**ఓ.యస్.నెం. 71/2024**

కుడుమల నారాయణ రెడ్డి, తండ్రి నాగిరెడ్డి, వయస్సు 50 సం॥లు, వ్యవసాయం, హిందూ, నివాసం వేంపల్లె టౌన్ & మండలం, వై. యస్. ఆర్.జిల్లా. **...పిటిషనరు**

**Vs**

బొంమ్మెపల్లె చిన్న సిద్దా రెడ్డి, మరణించినారు, ఆయన యొక్క వారసులు
1. బొంమ్మెపల్లె సుధర్శన్ రెడ్డి, తండ్రి బొంమ్మెపల్లె చిన్న సిద్దా రెడ్డి, వయస్సు 41 సం॥లు, వ్యవసాయం,
2. గూడ రాణి, తండ్రి బొంమ్మెపల్లె చిన్న సిద్దా రెడ్డి, వయస్సు 44 సం॥లు, గృహిణి,
పై అందరూ నివాసం డోర్ నెం. 3-84, కదిరేపల్లి గ్రామం, యు. రాజుపాళెం పోస్టు, వి.యన్. పల్లె మండలం, వై.యస్. ఆర్. జిల్లా.

**...రెస్పాండెంట్స్ నెం.2&3**

**నోటీసు**

పై నెంబరు గల దావాలో బొంమ్మెపల్లె చిన్న సిద్దా రెడ్డి గారిపై దావా డబ్బుల రాబట్టుకొనుటకు వాది సివిల్ కేసు దాఖలు చేసియున్నాడు. దావా విచారణలో వుండగా బొమ్మెపల్లె చిన్న సిద్దా రెడ్డి గారు మరణించినారు, ఆ తరువాత పై కేసులో ఆయన వారసులు అయిన మిమ్ములను రెస్పాండెంట్గా చేర్చడం జరిగినది. మీరు నోటీసులు తీసుకొనకపోవడం వలన రాజశ్రీ కోర్టు వారు పేపరు ప్రకటన కోరియున్నారు. కావున 17-06-2025 తారీఖున ఉదయం 10:30 గం॥లకు పై తెలిపిన కోర్టు యందు మీరు గానీ, మీ తరుపున వకీలు గానీ, హాజరై ఏమైనా ఆక్షేపణలు ఉన్నయెడల తెలుపుకొనవలెయును లేనంతట మీ పరోక్షముగా తీర్మానించబడును.

**వాయిదా తేది : 17-06-2025**

**యన్. చిన్నయ్య,**
న్యాయవాది, కడప.
సెల్ నెం. 9949224906.